# మహిళల స్వయం ఉపాధికి ప్రోత్సాహం

- ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి
- నారాయణఖేడ్‌లో గ్రామ దుకాణం ప్రారంభం
- మహిళాలకు చీరెలు పంపిణీ

నారాయణఖేడ్, అక్టోబర్ 7: మహిళల స్వయం ఉపాధికి ప్రోత్సాహమందిస్తూ సీఎంకేసీఆర్ ప్రభుత్వం వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి అన్నారు. శనివారం నారాయణఖేడ్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ దుకాణాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు మహిళలు తమ స్వశక్తితో ఎదిగేందుకు అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు. నాణ్యమైన ఆహార ఉత్పత్తులను మహిళా సంఘాల ద్వారా విక్రయించే విధంగా గ్రామ దుకాణాలను ఏర్పాటు చేయింస్తుందన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. అనంతరం రెడ్కో సహకారంతో పలు మహిళా సంఘాలకు చెందిన 98మందికి 60శాతం సబ్సిడీపై ఫ్యాన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాబార్డు ఏజీఎం కృష్ణతేజ్, రెడ్కో డీఎం మాణిక్యం చౌహాన్, మాజీ సర్పంచ్ ఎంఏ. నజీబ్, సిర్గాపూర్, పెద్దశంకరంపేట ఎంపీపీలు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్, నాగల్‌గిద్ద ఎంపీపీ ఉపాధ్యక్షుడు పండరియాదవ్, ఐకేపీ ఏపీఎం టిక్యానాయక్, నాయకులు రమేశ్‌చౌహన్, అంజాగౌడ్ పాల్గొన్నారు.


రెడ్కో సహకారంతో మహిళా సంఘాల సభ్యులకు ఫ్యాన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


నాగల్‌గిద్ద : కేశ్వార్‌లో చెరువు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

**ఖేడ్ అభివృద్ధికి మరో రూ.10 కోట్లు**

నారాయణఖేడ్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల కోసం రూ. 10కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో ప్రభుత్వానికి సమర్పించిన ప్రతిపాదనల మేరకు ఈ నిధులు మంజూరైనట్లు చెప్పారు.

**ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం**

నాగల్‌గిద్ద, అక్టోబర్ 7 : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కేశ్వార్ గ్రామంలో రూ. 6.27కోట్ల నిధులతో చేపట్టనున్న నూతన చెరువు, మోర్గీ మోడల్ పాఠశాల రూ. కోటి 28లక్షల నిధులతో ఏర్పాటు చేసిన బాలికల వసతి గృహన్ని, హైమాస్ట్ లైట్‌ను ప్రారంభించారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరెలు, యువతకు ఉచిత స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడు భూములను సస్యశ్యామలం చెసేందుకే ప్రభుత్వం నిధులు విడుదల చేందన్నారు. చెరువు పనులను వేగవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బాలికల విద్యా వికాసానికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాజురాథోడ్, ఎంపీపీ మోతీబాయి, వైస్ ఎంపీపీ పండరియాదవ్, మండల రైతుబంధు అధ్యక్షుడు నందుపాటిల్, ఇరిగేషన్ అధికారులు, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు మారుతి, జగప్ప, అంజిరెడ్డి, యూత్ అధ్యక్షుడు కృష్ణాప్రసాద్ ఉన్నారు.

**బీఆర్ఎస్ హయంలోనే అభివృద్ధి**

కంగ్టి, అక్టోబర్ 7: బీఆర్ఎస్ హయంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం తడ్కల్ మండలంలోని చాప్టా(కె), చాప్టా(బీ), రాసోల్, దామరిగిద్ద, బాన్సువాడ తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగీతావెంకట్‌రెడ్డి, జడ్పీటీసీ లలిత ఆంజనేయులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంగారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే మహిళలకు గుర్తింపు**

మనూరు, అక్టోబర్ 7: బీఆర్ఎస్ ఆధ్వర్యంలోనే మహిళలకు ప్రత్యేక గుర్తింపు లభించిందని ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అన్నారు. శనివారం మనూరు ఐకేపీ కార్యాలయంలో మహిళలకు చీరల పంపిణీ చేశారు.

అనంతరం మండలంలోని మహిళ సంఘాల సభ్యులకు సబ్సిడీపై ఫ్యాన్లు పంపి ణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొంగరి జయశ్రీమోహన్‌రెడ్డి, సర్పంచ్ శివాజీరావు, మండల అధ్యక్షుడు విఠల్‌రావు, ఎంపీటీసీలు రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీవో షాజీలోద్దీన్, ఐకేపీ ఏపీఎం వంశీకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## లోన్ ఆశచూపి రూ. 2.35 లక్షలకు కుచ్చు టోపీ

అమీన్‌పూర్, అక్టోబర్ 7: లోన్ ఇప్పిస్తామని ఆశ చూపి ఓ వ్యక్తి నుంచి రూ. 2.35లక్షలను సైబర్ నేరగాళ్లు దోచుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి గత ఏడాది మే 31వ తేదీ రూ. కోటి లోన్ ఇప్పిస్తామని ఫోన్‌కాల్ వచ్చింది. దీంతో బాధితుడు అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నమ్మి రూ. 2.35లక్షలను చెల్లించాడు. లోన్ ప్రాసెస్‌లో ఉందని వస్తుందని చెప్పి నమ్మిస్తూ రాగా బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## దురుసుగా ప్రవర్తించిన వారిపై కేసు

నారాయణఖేడ్, అక్టోబర్ 7: మండలంలోని జూకల్ గ్రామంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వినయ్, నరేశ్, మల్లప్ప, వీరన్న దురుసుగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి తెలిపారు. నలుగురు మద్యం సేవించి కార్యక్రమానికి అంతరాయం కలిగించే ప్రయత్నం చేశారన్నారు.

## దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

కల్హేర్, అక్టోబర్ 7 : బైకు అదుపు తప్పి పొలంలోకి దూసుకుపోయి పడిపోయిన వ్యక్తులను పైకి లేపేందుకు యత్నించిన వ్యక్తి గొంతుపై పదునైన ఆయుధంతో దాడి చేసి గాయపర్చిన వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో గంగరాం తెలిపారు. శుక్రవారం రాత్రి 11గంటల సమయంలో కల్హేర్ మండలం కృష్ణాపూర్ నుంచి నారాయణఖేడ్ మండలం సంజీవరావుపేట్ వైపు బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వెళ్తున్నారు. ఈ క్రమంలో కల్హేర్ మండలం నాగ్‌దర్ చౌరస్తా సమీపంలోకి వెళ్లగానే బైకు అదుపుతప్పి పొలంలోకి దూసుకుపోయింది. నాగ్‌దర్ గ్రామానికి చెందిన పెద్ద నాయికిని నాగయ్య పొలం కాపలాకు వెళ్తున్న క్రమంలో బైకుపై నుంచి పడిపోయిన వారిని పైకి లేపేందుకు యత్నించాడు. నీ మూలంగానే ప్రమాదం జరిగిందని పదునైన ఆయుధంతో మెడపై దాడి చేసి గాయపర్చారు. దీంతో గాయాలకు గురైన నాగయ్య అరుపులు, కేకలు వేయడంతో చుట్టు పొలాల్లో కాపల ఉన్న రైతులు రావడంతో గాయపర్చిన వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన నాగయ్యను సర్కారు దవాఖానకు తరలించారు. అదే గ్రామానికి చెందిన చిన్న నాయికిని సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఎల్ఐసీ ఏజెంట్లు

పటాన్‌చెరు, అక్టోబర్ 7: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని జీహెచ్ఎంసీ ప్రణాళిక విభాగం అధ్యక్షుడు, జీవిత బీమా ఏజెంట్ల సమాక్య సభ్యులు కలిశారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్ఐసీ ఏజెంట్లు కలిసి ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతనం బీహెచ్ఈఎల్ బ్రాంచ్‌కు ఎక్కడైనా స్థ లం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ప్రజలకు జీవితబీమా భద్ర త కల్పిస్తున్న జీవిత బీమా ఏజెంట్ల సమాక్య కోరికను తీర్చాలని వారు కోరా రు. ఎమ్మెల్యే వారి వినతిపై సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో చైర్మన్ ఏఎల్ఎన్ రెడ్డి, సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, ట్రెజరర్ అశోక్, అమరేందర్‌రెడ్డి, డీవీ శ్యామ్, రామారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పాటుపడాలి

కంది, అక్టోబర్ 7 : కేంద్రప్రభుత్వం మొండివైఖరి వీడి రైతు సంక్షేమానికి పాటుపడాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నా రైతుల బ్రతుకులు మాత్రం మారడం లేదని, కేంద్రంలో రైతు రాజ్య స్థాపన దిశగా, రైతులకు మేలు చేసే పార్టీనే గెలిపించాలని పిలుపునిచ్చారు. రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం కేంద్రప్రభుత్వం పరిష్కరించాల్సిన రైతు సమస్యలపై పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు పండించిన పంట సాగు ఖర్చులకు మూడు రేట్లు ఉండే విధంగా మద్దతు ధర ప్రకటించాలని, ప్రకటించిన కనీస మద్దతు ధరకు చట్టబద్దత కల్పించాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగంతో అనుసంధానం చేయాలని, కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని, ప్రైవేట్ అప్పులు తీర్చుకునేందుకు రైతులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు రక్షణ సమితి నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూధన్ రెడ్డి, రాంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

## శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించండి

చౌటకూర్, అక్టోబరు 7: చౌటకూర్ గ్రామంలో దళితులకు శ్మశాన వాటిక ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని ఆ గ్రామ దళితులు కోరారు. ఈ మేరకు శనివారం జిల్లాకేంద్రమైన సంగారెడ్డికి వెళ్లి కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గతంలో గ్రామ శివారులో శ్మశాన వాటిక ఉండేదని, ఆ స్థలం సంగారెడ్డి–నాందేడ్, అకోలా 161జాతీయ రహదారి విస్తరణతో కోల్పోయామన్నారు. ఈ విషయమై ఇప్పటికే ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ దృష్టికి తీసుకువెళ్లగా, కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయాలని సూచించడంతో ఆ మేరకు సంగారెడ్డికి వెళ్లి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చౌకంపల్లి శివకుమార్, ఉప సర్పంచ్ మన్నె నాగయ్య, నాయకులు బేగరి ఆదాం, తలారి దేవయ్య, వినోద్‌కుమార్, శాంతయ్య, చాకలి మోహన్, బేగరి విజయ్ ఉన్నారు.

## శివంపేటలో బీఆర్ఎస్ కార్యకర్తకు ఎల్వోసీ అందజేత

చౌటకూర్, అక్టోబరు 7: మండలంలోని శివంపేట గ్రామానికి చెందిన సోల్కంపల్లి విశ్వనాథ్‌కు రూ. 2.50లక్షల ఎల్వోసి పత్రాన్ని శనివారం అందజేశారు. విశ్వనాథ్ రోడ్డు ప్రమాదానికి గురై నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. విశ్వనాథ్ విషయాన్ని గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎంపీపీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ అలీం ఎమ్మెల్యే క్రాంతికిరణ్ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం ద్వారా ఎల్వోసీ పత్రాన్ని అందజేశారు. శనివారం ఆ పత్రాన్ని విశ్వనాథ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సోల్కంపల్లి సంతోష్‌కుమార్, ఏర్పుల రాజేందర్, సోల్కంపల్లి రాజు తదితరులు ఉన్నారు.

## జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పల్లె సంజీవయ్య


అందోల్ : జోగిపేట మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పల్లె సంజీవయ్య

అందోల్, అక్టోబర్ 7: జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పుల్కల్ మండలం గొంగ్లూర్ గ్రామానికి చెందిన పల్లె సంజీవయ్య నియామకయ్యారు.బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న పల్లె సంజీవయ్యకు అధిష్టానం సముచిత స్థానం కల్పించి చైర్మన్ పదవిని కట్టబెట్టింది. శనివారం ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆయన కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైస్ చైర్మన్‌గా విక్రమ్‌గౌడ్ నియామకమయ్యారు. డైరెక్టర్లుగా నాగులపల్లి శ్రీహరి, శేరిమాణిక్‌రెడ్డి, కప్పాటి శ్రీనివాస్, కునదొడ్డి శ్రీనివాస్, నేనావత్ చాంప్లనాయక్, అశోక్ పెండ్యాల రాములు, చాకలి వేణుగోపాల్, కాళీదాస్‌గౌడ్, తాజొద్దీన్, సంతోషిణి, పద్మతో పాటు పీఏసీఎస్ చైర్మన్ జోగిపేట, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఏడీఏ జోగిపేట, మున్సిపల్ చైర్మన్ అందోల్–జోగిపేట డైరెక్టర్లుగా ఉండనున్నారు. ఈ సందర్భంగా పల్లె సంజీవయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో చైర్మన్ పదవిని అప్పగించినందుకు ఎమ్మెల్యే క్రాంతికిరణ్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ బీబీ పాటిల్, జడ్పీ చైర్మన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతిలకు, నియోజకవర్గ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైతుల ఎలాంటి సమస్యలు రాకుండా చూడడంతో పాటు మార్కెట్ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

**చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పల్లె సంజీవయ్య**

జోగిపేట ఏఎంసీ చైర్మన్‌గా శనివారం పల్లె సంజీవయ్య బాధ్యతలు స్వీకరించారు. మాజీ చైర్మన్ మల్లికార్జున్ గుప్తా సమక్షంలో నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి రిజిష్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మద్ధతు ధర కల్పిడంతో పాటు మార్కెట్‌యార్డును లాభాల బాటలో నడిపేందుకు ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ సహకారంతో తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి సునీల్‌కుమార్, పుల్కల్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ నాయకులు వెంకటేశం, శంకరయ్య పాల్గొన్నారు.

## గ్రామీణ బ్యాంక్ రైతన్నకు భరోసా

రాయికోడ్,అక్టోబర్ 7 : తెలంగాణ ప్రభుత్వం రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని వసతులు కల్పిస్తుందని గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సురేంద్ర అన్నారు. శనివారం మండలంలోని ఖామ్‌జమాల్‌పూర్‌లో ఆర్థిక అక్షరాస్యత సదస్సును ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు, ప్రజలకు అతి తక్కువ వడ్డీకే మహిళా సంఘాలకు, రైతులకు, బంగారంపై అతి తక్కువ వడ్డీకే లోన్లు ఇస్తున్నామన్నారు. వ్యవసాయ రుణాలతో పాటు ధీర్ఘకాల రుణాలను ఇస్తున్నామని తెలిపారు. ఖామ్‌జమల్‌పూర్ గ్రామానికి చెందిన బొల్లి లింగారెడ్డి ఇటీవల మరణించాడు. వారి కుటుంబ సభ్యులకు రూ. 2లక్షల బీమా చెక్కును అందజేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సిద్దారెడ్డి, ధర్మారెడ్డి, సర్పంచ్ నరేశ్‌కుమార్, సిబ్బంది ప్రశాంత్, సమాంత్, నాగామణి ఉన్నారు.


బీమా చెక్కును అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

